పాతబస్తీ అభివృద్ధికి నిరంతర కృషి

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

చార్మినార్: పాతబస్తీలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వంతో కలిసి తమ పార్టీ కృషి చేస్తుందని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఈ మేరకు అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్విందు కుమార్‌తో కలిసి ఆయన శుక్రవారం పాతబస్తీలో పర్యటించారు. అరవింద్‌కుమార్ పాతబస్తీలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. దాదాపు రూ.180 కోట్లకు పైగా నిధులతో ఈ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఇప్పటికే రూ.29.50 లక్షలతో సుందరీకరణ చేపట్టిన చార్మినార్ గుల్జార్ హౌజ్ ఫౌంటెన్‌ను ప్రారంభించారు. దీంతో పాటు మూసీనదిపై కొత్తగా నిర్మించనున్న రెండు ఐకానిక్ పాదచారుల బ్రిడ్జిల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అఫ్జల్‌గంజ్ వైపు రూ.40 కోట్ల నిధులతో, మరొకటి నయాపూల్ బ్రిడ్జికి ఈస్టెన్ సైడ్‌లో మరో రూ.40 కోట్లతో నిర్మించనున్న ఐకానిక్ పెడస్ట్రియన్ బ్రిడ్జిల పనులకు శంకుస్థాపన చేశారు. శాలిబండ రోడ్డులోని చార్మినార్ పాత బస్టాండ్ ఖాళీ స్థలంలో రూ.34.6 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించనున్న జీహెచ్ఎంసీ మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అలాగే రూ.36 కోట్లతో లాడ్‌బజార్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. చార్మినార్ వద్ద రోజువారి వ్యాపారాలు కొనసాగించుకునే చిరు వ్యాపారుల సౌకర్యార్థం మూసీనది రెండు పాదచారుల బ్రిడ్జిలను నూతనంగా నిర్మిస్తున్నామన్నారు. ఈ రెండింటిపై చిరు వ్యాపారులు రోజువారి వ్యాపారాలను నిరంతరాయంగా కొనసాగించవచ్చునన్నారు. ముర్గీచౌక్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని... అలాగే మోతీగల్లీ ఓల్డ్ పెన్షన్ పేమెంట్‌లో కూడా మల్టీ లెవల్ పార్కింగ్ పనులు కూడా ప్రారంభం కానున్నాయన్నారు. ఎమ్మెల్సీలు మీర్జా రహమత్ అలీ బేగ్, మీర్జా రియాజుల్ హసన్ హఫందీ తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం జరిగిన ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనాల్సిన మంత్రి కేటీఆర్ అనివార్య కారణాలతో హాజరు కాలేకపోవడంతో ఆయన స్థానంలో అరవింద్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు.


గుల్జార్‌హౌజ్ ఫౌంటెన్‌ను ప్రారంభిస్తున్న అర్విందు కుమార్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

క్లుప్తంగా...

ప్రపంచ స్థాయిలో జూపార్కును తీర్చిదిద్దుతాం


మాట్లాడుతున్న అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

బహదూర్‌పురా: జీవ వైవిధ్యానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కును సీఎం కేసీఆర్ సహకారంతో ప్రపంచ స్థాయి జూగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నెహ్రూ జూలాజికల్ పార్కులో ఏర్పాటు చేసిన వైల్డ్ లైఫ్ డైమండ్ జూబ్లీ వారోత్సవాలు (69 వసంతాలు), జూపార్కు వజ్రోత్సవాల్లో (60 వసంతాల పూర్తి చేసుకుంది) కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ ఆన్‌లైన్ టికెట్ సేవలు, జూపార్కు ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన వజ్రోత్సవాల లోగోను, అనంతరం డైమండ్ జూబ్లీ పైలాన్, సెంట్రల్ ఫౌంటెన్‌ను ఆవిష్కరించారు. 30 ఏళ్ల అనంతరం మళ్లీ 2 క్యాపిచినో మంకీస్‌ను, మంకీ మోట్‌లోకి 2 వైట్ టైగర్స్‌ను సందర్శకుల సందర్శనార్థం టైగర్ మోడ్‌లోకి విడుదల చేశారు. రెండు తెల్ల పులులకు శివపార్వతులుగా మంత్రి నామకరణ చేశారు. జూ సందర్శనకు కోసం ఎలక్ట్రికల్ బైసైకిల్, గ్లాండ్ ఫార్మా దాతృత్వంలో కొనుగోలు చేసిన ఎలక్ట్రికల్ రోడ్ ట్రిన్ సేవలను ప్రారంభించి షికారు చేశారు. పీసీసీఎఫ్ అండ్ హెచ్ఓఎఫ్ఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్, వైల్డ్ లైఫ్ చీఫ్ వార్డెన్ లోకేశ్ జైస్వాల్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఆర్.శోభ, పీసీసీఎఫ్ (విజిలెన్స్) ఏలూసింగ్ మేరు, పీసీసీఎఫ్ (ఎఫ్‌సీఏ) ఎం.సి.పర్గెయిన్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఉద్యోగులకు వెంటనే 18 శాతం ఐఆర్ ప్రకటించాలి

యాకుత్‌పురా: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుకు ఇటీవల ఇచ్చిన ఐఆర్ జీఓను రద్దు చేసి వెంటనే 18శాతం ఐఆర్ ప్రకటించాలని తెలంగాణ న్యాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌పీ సుబ్బయ్య డిమాండ్ చేశారు. పురానీహవేలీలో సిటీ సివిల్ కోర్టులోని సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన సంఘం సభ్యులతో కలిసి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇంత తక్కువ ఐఆర్ ఇచ్చిన ముఖ్యమంత్రిని మేము చూడలేదన్నారు. రెండవ పీఆర్సీ కమిటీని నియమించినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న మూడు డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. సంఘం ఉపాధ్యక్షుడు నరేష్, కార్యానిర్వహక కార్యదర్శి రాకేష్, కార్యకర్గ సభ్యులు పాల్గొన్నారు.

‘రేవంత్‌రెడ్డి పక్కా ఆర్‌ఎస్‌ఎస్ వాది’


అసదుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పక్కా ఆర్‌ఎస్‌ఎస్ వాది అని హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. శుక్రవారం గోల్కొండ కోట బస్టాప్ వద్ద గల గ్రౌండ్‌లో జల్సా రహమతుల్ ఆలమీన్ జరిగింది. మిలాద్-ఉన్-నబీని పురస్కరించుకోని జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా వచ్చి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగారు. రేవంత్‌రెడ్డి ఏబీవీపీ కార్యకర్తగా ప్రస్థానం చేశారని అనంతరం ఆర్‌ఎస్‌ఎస్‌లో పని చేశారని ఆయన గుర్తుచేశారు. భారతదేశంలో ఏ వర్గానికి చెందిన వారు కూడా ఏ రాష్ట్రంలోనైనా ఏ ప్రదేశంలోనైనా జీవించే హక్కు ఉందని ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఆయన అన్నారు. ఒవైసీ కుటుంబం మహారాష్ట్రా నుంచి నగరానికి వలస వచ్చిందని రేవంత్‌రెడ్డి చెప్పడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు. 1999లో కార్వాన్ నియోజకవర్గం నుంచి ఇప్పటి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేశారని ఆ సమయంలో రేవంత్‌రెడ్డి మజ్లిస్‌కు వ్యతిరేకంగా పని చేశారని ఆయన గుర్తుచేశారు. గోల్కొండ జల్సా కమిటీ అధ్యక్షుడు గులామ్ మొహియుద్దీన్ ఖాన్ పాషాభాయ్, అజీజ్‌ఖాన్ పటాన్, షకీల్ అలీఖాన్ తదితరులున్నారు.

‘బీజేపీకి ప్రజలే గుణపాఠం చెబుతారు’

అబిడ్స్: పదేళ్లలో గోషామహల్ నియోజకవర్గ ప్రజల అభివృద్ధిని విస్మరించిన బీజేపీకి రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, గడ్డం గంగాధర్‌యాదవ్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజాసింగ్ నియోజకవర్గ అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని పక్కకు నెట్టివేశారని ఆయన అన్నారు. శుక్రవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. హిందూ రాష్ట్రం కావాలంటూ ఎమ్మెల్యే ప్రకటనలు చేస్తున్నారని ఆయన ఎద్దేవ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం హిందూ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే ఎవరైన వ్యతిరేకించారా అని ఆయన అన్నారు. గోషామహల్ నలుమూలలా వేలాది మంది విద్యార్థులకు ఉచితంగా ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యను అందిస్తున్న ఘనత తమ ఫౌండేషన్‌దే అన్నారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ప్రియాగుప్తా, శీలం సరస్వతి, జయశంకర్, ఏనుగుల వినోద్‌కుమర్, సతీష్, గడ్డం సురేష్ యాదవ్, గడ్డం గగణ్ యాదవ్, గడ్డం గౌరవ్ యాదవ్, గడ్డం కృష్ణయాదవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్

సన్మానం



అబిడ్స్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనదకుమార్‌గౌడ్, నందుకుమార్ గజమాలతో సత్కరించారు. భారీ గజమాలతో తలసానిని సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బాలికపై అత్యాచార కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

గౌలిపురా: బాలికపై అత్యాచార కేసులో ఓ వ్యక్తికి శుక్రవారం నాంపల్లిలోని 12వ ఏఎంఎస్‌జే కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం..లలితాబాగ్ కాళికానగర్‌కు చెందిన ఎం.నారాయణ (32) 2019లో భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలిక (9)పై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దీనిపై భవానీనగర్ పోలీసులు నిందితుడు నారాయణను అరెస్ట్ చేసి సాక్ష్యాధారాలతో శుక్రవారం నాంపల్లిలోని 12వ ఏఎంఎస్‌జే కోర్టులో హాజరు పరచగా పూర్వాపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం

అబిడ్స్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. పలు తెలంగాణ రాష్ట్ర పథకాలను ఇతర రాష్ట్రాలు అమలు చేస్తుండడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. శుక్రవారం బేగంబజార్‌కు చెందిన వ్యాపారవేత్తలు దాముతో పాటు పలువురు నాయకులు మంత్రి తలసానికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. ప్రజల కోసం సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిరంతరం తపిస్తుందన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పలు పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ కూడా ప్రారంభించామన్నారు. ఇలాంటి పథకం దేశంలోని ఏ రాష్ట్రంలో లేదన్నారు. ఈ సందర్భంగా మంత్రికి దాముతో పాటు పలువురు వ్యాపారవేత్తలు సన్మానం చేశారు.


మంత్రి తలసానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దాము

తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రం


లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ నాయకుడు శేఖర్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న మిత్ర కృష్ణ

గోల్కొండ: సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా ఎదిగిందని కార్వాన్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. శుక్రవారం లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కె.శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ..ఎప్పుడు ఎన్నికలు జరిగినా మళ్లీ బీఆర్‌ఎస్ తిరుగులేని మెజార్టీతో అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చందు, వెంకట్‌రెడ్డి, జంగారెడ్డి, టీజీ రాజుయాదవ్ తదితరులున్నారు.

జన్మదిన శుభాకాంక్షలు

గోల్కొండ: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజలో ఉందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మంత్రి జన్మదినం సందర్భంగా కార్వాన్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు కె.శేఖర్‌రెడ్డి ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



బతుకమ్మ చీరల పంపిణీ


చీరలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

గౌలిపురా: దసరా పండగను పురస్కరించుకొని గౌలిపురా డివిజన్ అంబికానగర్‌లోని శాంతినికేతన్ స్కూల్‌లో శుక్రవారం కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు ఎ.శివచంద్రగిరి, గౌలిపురా డివిజన్ అధ్యక్షుడు జి.రఘుకాంత్, బీజేపీ నాయకులు ఇ.సుమన్‌కుమార్ ముదిరాజ్, జమాల్‌పూర్ అశోక్, సుష్మా, అనుషా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తలసానికి శుభాకాంక్షలు

చార్మినార్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ జన్మదిన వేడుకలు శుక్రవారం నగరంలోని కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి స్టేడియంలో ఘనంగా జరిగాయి. మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, బేలా ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పోటేల్ సదానంద్ యాదవ్, సుల్తాన్ షాహీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేశ్ తివారీలతో పాటు హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు మధుసూదన్ యాదవ్, అనంతోజు హన్స్‌రాజ్ తదితరులు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి బొకే అందజేసి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


మంత్రి తలసానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న పాతబస్తీ ఆలయాల ప్రతినిధులు